క్లుప్తంగా

శిశు గృహ సేవలు అభినందనీయం



శిశుగృహకు క్రెడిల్‌ను అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోక అభాగ్యులైన పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న శిశుగృహ సేవలు చాలా గొప్పవని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని శిశుగృహకు శుక్రవారం రూ. 20 వేల విలువైన క్రెడిల్‌ను బహూకరించారు. అధికారులు సూచించిన మేరకు తమ సంస్థ, సానా సతీష్ బాబు ఫౌండేషన్ సహకారంతో దానిని సమకూర్చినట్టు తెలిపారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్రావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు అనసూరి రాజకుమారి, సత్తిబాబు, శిశుగృహ మేనేజర్ నూకరత్నం, ఐసీడీఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి

కాకినాడ రూరల్: విప్లవకారుడు చేగువేరా జయంతిని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చేగువేరా చిత్ర పటానికి చింతకాయల సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, రామారావు, రాజా, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు నివాళులర్పించారు.

పేద విద్యార్థికి భరోసా



శ్లోకకు పుస్తకాలు అందిస్తున్న బీజేపీ సిటీ కన్వీనర్ సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్థానిక 29వ డివిజన్‌కు చెందిన ఎం.శ్లోక పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించింది. అయితే ఆమె ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్మీడియట్ చదువుకునేందుకు వీలు లేక ఇంటి దగ్గరే ఉండిపోయింది. బీజేపీ సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆమె ఆర్థిక పరిస్థితిని బీజేపీ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణకు వివరించారు. ఆయన వెంటనే ఆమెను అన్నవరం సత్యదేవి ఉమెన్స్ కళాశాలలో చేర్పి ఫీజు మొత్తం చెల్లించి ఆమెకు కావాల్సిన పుస్తకాలను శుక్రవారం అందజేశారు.

ఆయిల్ కంపెనీపై దాడులు

యానాం: గంధం చెక్కల నుంచి ఆయిల్ తీసే కంపెనీపై శుక్రవారం అటవీశాఖ అధికారులు దాడులు చేయడం సంచలనమైంది. విలియనూర్ సమీపంలో ఉలవైక్కల్ గ్రామంలో పుదుచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి తేనె జయకుమార్ కుమార్తె ప్రేమకు చెందిన ఆయిల్ కంపెనీ ఉంది. దానిని కేరళ రాష్ట్రానికి చెందిన నాజర్ అద్దెకు తీసుకుని ఇండో అగ్రో ఎసెన్షియల్ ఆయిల్ (బి) లిమిటెడ్ పేరుతో నడుపుతున్నారు. ఇక్కడ చందనం నుంచి నూనె తీస్తున్నారు. అయితే కొద్దిరోజుల క్రితం సేలం ప్రాంతంలో గంధం దుంగలను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు అడ్డుకుని విచారించారు. అయితే వాటిని పుదుచ్చేరి ఉలవైక్కల్ ప్రాంతంలో కంపెనీకి కేరళ నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.5 టన్నుల చందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా సేలం జిల్లా అటవీశాఖ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సురేష్, పుదుచ్చేరి అటవీశాఖ డీఎండీ ఫారెస్ట్ అధికారి, తహసీల్దార్ శేఖర్‌తో సహా 20 మందికి పైగా అధికారుల బృందం గురువారం అర్ధరాత్రి వేళ విలియనూర్‌లో భద్రపరిచిన చందనం దుంగలను తనిఖీ చేశారు. శాండిల్‌వుడ్ ఆయిల్ కంపెనీ వద్ద జరిపిన సోదాల్లో 40 కేజీల చొప్పున చందనం ఆరు బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో గొడౌన్‌కు తాళాలు వేశారు. శుక్రవారం అటవీశాఖ మళ్లీ తనిఖీలు చేపట్టి, వాటికి పోలీసు రక్షణ అవసరమని విలియనూర్ ఎస్పీ కార్యాలయానికి లేఖ అందించింది.

ఇంధన వనరులు పొదుపుగా వాడాలి

సామర్లకోట: పర్యావరణ సమతుల్యత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంధన వననరులను పొదుపుగా వినియోగించే అలవాటు చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామ కృష్ణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ స్కూల్‌లో శుక్రవారం సాయంత్రం ఎకో క్లబ్ వారోత్సవాలల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాడకం అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీన పందిరి రాట మూహూర్తం చేయనున్నట్టు ఈఓ తెలిపారు.

ఏమరుపాటు ప్రాణం తీయొచ్చు!

- వానాకాలంలో విద్యుత్ విషయంలో అవగాహన, జాగ్రత్త ఎంతో అవసరం
- ఆపత్కాలంలో అప్రమత్తతే ఆయుధం

కాకినాడ సిటీ: నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబ సభ్యులు విద్యుత్ ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్నప్పుడు గోడలు, నేల, విద్యుత్ స్తంభాలు అంతా తేమతో నిండి ఉంటాయి. ఈ తేమతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేలకు, గోడలకు ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవాహం జరిగే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో వినియోగారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఇళ్లకు చేర్చి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో విద్యుత్ పరికరాల మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఏమరుపాటు వహించిన ప్రమాదానికి గురవుతారు. తగిన జాగ్రత్తలు పాటించడమే దీనికి నివారణ. విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో గాని సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో కాని తెలపాలి.

– ప్రసాద్, డివిజనల్ విద్యుత్‌శాఖ అధికారి, కాకినాడ.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాలు కురుస్తున్నప్పుడు, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టేవైరు, సపోర్టు వైరును తడిసిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. వాటికి దూరంగా నడవాలి.
- దండెం వైర్లు, విద్యుత్ వైర్లను కలపొద్దు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలి.
- వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తాగి షాక్ ఇచ్చే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేయాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైరును మాత్రమే ఉపయోగించండి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- ఎవరికైనా పొరపాటున విద్యుత్ షాక్ తగిలితే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో అతన్ని నేరుగా ముట్టుకోవద్దు. కర్ర, ప్లాస్టిక్ లాంటి వస్తువులతో అతని నుంచి వైరును వేరు చేయాలి.
- ముఖ్యంగా రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం పంపుసెట్లను వాడుతున్నప్పుడు కరెంటు మోటార్లకు కాని, పైపులను కాని, ఫుట్‌వాల్వ్‌లను కానీ ఏమరపాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత ప్రమాదాలు ఎర్త్ చేయని పక్షంలో పరికరాల వల్లే ప్రమాదాలు జరుగుతాయి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏజీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు, పంపు సెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగవచ్చు. మోటారు మరమ్మతు చేయడం తెలిసిన వారిచేతనే వాటిని బాగు చేయించండి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందికి లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్, సెక్షన్ ఆఫీసర్‌లను సంప్రదించి వారి సేవలను పొందాలి.

మంత్రిప్రగడవారి సత్రం చైర్మన్ రాజీనామా

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని మంత్రిప్రగడవారి సత్రం చైర్మన్ చిట్నీడి నారాయణమూర్తి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు సత్రం కార్యవర్గ సభ్యులు కూడా రాజీనామ చేసి సత్రం ఈఓ సుబ్రహ్మణ్యంకు అందించారు. గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓటమి చెందడంతో తాము నైతిక బాధ్యతగా తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

సమాజ అవసరాల మేరకు సేవలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: సమాజం, ప్రజల అవసరాలు గుర్తించి వాటికి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వీఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు సాయి స్నిగ్ధ, వినూత్న రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 150 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. సభ్యులు ఏడుకొండలు, సత్యశాంతి, భారతి, కవిత, సాయివాణి, ఆర్‌జీ రామారావు పాల్గొన్నారు.

ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు

- కమిషనర్ వెంకటరావు
- నగరంలోని పలు పార్కుల పరిశీలన

కాకినాడ: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఉద్యానవనాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడ వివేకానంద పార్కును సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పార్కు ఆవరణలోని పచ్చదనాన్ని, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలను పరిశీలించారు. వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పిల్లల కోసం మరిన్ని క్రీడా పరికరాల ఏర్పాటు, ట్రాక్ అభివృద్ధి సహా సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే కాకినాడ వివేకానంద పార్కులో ఎన్నో సదుపాయాలు కల్పించామన్నారు. వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మరిన్ని అదనపు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాకినాడ నగరంలోని ఇతర ఉద్యాన వనాలను కూడా మరింత అభివృద్ధి చేసి సౌకర్యవంతంగా, ఆహ్లాదాన్ని కలిగించేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా వివేకానంద పార్క్ పరిసరాల్లోని పింక్ టాయిలెట్లు, ఇతర ప్రాంతాల్లోని స్మార్ట్ పబ్లిక్ టాయిలెట్లను కూడా కమిషనర్ సందర్శించారు. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలో తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పార్కులో క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆర్థికభారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రారంభరోజు నుంచి సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మండల పరిధిలోని 65 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి 7వ తరగతికి మినహా మిగిలిన అన్ని తరగతులకు పాఠ్య, నోట్ పుస్తకాలు రాగా, ఆయా పాఠశాలలకు పంపించి, విద్యార్థులకు పంపిణీ చేయించినట్టు ఎంఈఓలు బుల్లికృష్ణవేణి, సత్యనారాయణ తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక కోసూరివారివీధిలోని ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోందని ప్రదర్శన నిర్వాహకుడు జయేశ్‌కుమార్ గుప్తా తెలిపారు. సహజమైన ఫైబర్ సిల్క్ చీరలు ఈ ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. ఈ ప్రదర్శన కేవలం మూడు రోజులు మాత్రమే ఉంటుందన్నారు. దేశం నలుమూలల నుంచి చేనేత కార్మికులు తయారుచేసిన జామ్దానీ సిల్క్, కాంచీపురం, బీహార్ టస్సర్, భాగల్‌పురీ సిల్క్ గుజరాత్ బాందినీ, పటోలా, పశ్చిమ బెంగాల్ బైలు, కాంతా, హ్యాండ్ పెంయింట్ శారీస్, డాకయ్ జామ్దానీ, పైథానీ, ఎంపి చందేరీ, మహేశ్వరి శారీస్, షిగోరీ, కళంకారీ, రాజస్థాన్ బ్లాక్ ప్రింట్, చత్తీస్‌ఘడ్ కోసా, ఖాదీసిల్క్ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. 50 శాతం వరకూ డిస్కౌంట్ ఉందని ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలు వరకూ ఉంటుందన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు (పాఠ్య, నోటు పుస్తకాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, హెచ్‌ఎం కె.చినరామమూర్తి, సీఆర్పీలు ఇ.రాంజీప్రసాద్, ఎన్.అప్పన మల్లేషు, బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్మవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‹క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్› కార్యక్రమంలో భాగంగా చెత్తను తగ్గించుట, చెత్తను డబ్బాలో సేకరించి కిచెన్ గార్డెన్‌ను కంపోస్టుగా వినియోగించే కార్యక్రమాన్ని విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీఎంఓ నాగేశ్వరరావు పరిశీలించారు. చెత్తను తగ్గించడం, దానిని ఉపయోగకరంగా మార్చడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ వి.రాజబాబు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

బోట్‌క్లబ్: అత్యవసర సమయంలో రక్తం అందక వందలాది మంది చనిపోతున్నారని మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి అన్నారు. స్థానిక సూర్య కళా మందిరంలో శుక్రవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా కాకినాడలోని వివిధ రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని 4వ అదనపు జిల్లా జడ్జి, ఎం.హరినారాయణ, న్యాయమూర్తులు నికిత ఆర్.వరోరా, కె.శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కమలాదేవి మాట్లాడుతూ ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంతో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడేందుకు రోటరీ క్లబ్ రక్తం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ మాట్లాడుతూ వేసవి కారణంగా బ్లడ్ బ్యాంక్‌లో రక్తం కొరత ఏర్పడిందన్నారు. దానిని అధిగమించేందుకు కాకినాడలోని అన్ని రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. బ్లడ్ బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ రోటరీ, రెడ్ క్రాస్ వంటి బ్లడ్ బ్యాంక్‌లలో మాత్రమే స్వచ్ఛమైన రక్తం దొరుకుతుందన్నారు. పెద్ద సంఖ్యలో రక్తదాతలు పాల్గొని 262 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన వారికి రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమానికి మైలపల్లి విద్యా సాగర్ అధ్యక్షత వహించగా రోటరీ మాజీ గవర్నర్లు లక్కరాజు సత్యనారాయణ్, ఎస్‌వీఎస్ రావు, బ్లడ్‌బ్యాంకు సెక్రటరీ వర్మ పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రెడ్‌క్రాస్ ప్రథమం

కాకినాడ సిటీ: తలసీమియా వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక సేవా కేంద్రం ద్వారా సేవలను అందజేయడంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ముందుందని అడిషనల్ డీఎం హెచ్‌వో డాక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలో కోస్ట్‌గార్డ్, సెట్రాజ్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ తదితర సంస్థలచే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్తదానం ఎందరికో ఉపయోగపడుతుందని, ప్రమాదంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు అగ్రస్థానంలో ఉందన్నారు. రక్తదాన శిబిరాన్ని కోస్ట్‌గార్డు కమాండెంట్ టీఆర్‌కే రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ బ్లడ్‌బ్యాంకుకు అత్యధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి సహకరించిన కాకినాడ సీపోర్టు లిమిటెడ్, ఆదిత్య విద్యాసంస్థలు, వికాస, దొంతమూరు యూత్, పద్మపూజిత ఫైనాన్స్, జె.అరవింద్, అజర్ మొహిద్దీన్‌లను సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ తలసీమియా వ్యాధి గ్రస్తులకు, ఆపదలో ఉన్న వారికి సహకరించిన వారందరికీ రెడ్‌క్రాస్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సెట్‌రాజ్ సీఈవో మూర్తి, వికాస పీడీ లచ్చారావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

రక్తదాతలకు సన్మానం

కాకినాడ రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాతలు జి.కృష్ణమోహన్, పోలిశెట్టి తాతీలు, గుబ్బల సత్తిరాజు, పేపకాయల శివకుమార్, పి.మణికుమార్, తదితరులను శుక్రవారం ఘనంగా సన్మించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా సూర్యారావు మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అన్నారు. పలుసార్లు రక్తదానంతో ఆదర్శంగా నిలిచిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, శ్రీనగేష్, రామారావు, పార్థసారధి, కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.